గోపుర ప్రతిష్ఠ మహోత్సవాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని శంకరమఠంలోని ఆలయ శిఖర గోపుర ప్రతిష్ఠ మహోత్సవాలు సోమవారం మొదటి రోజు వైభవంగా ప్రారంభమయ్యాయి. శంకరాచార్యులకు అర్చన, ఉమామహేశ్వరస్వామికి అభిషేకం, యోగ లింగేశ్వర స్వామికి, సర్వమంగళ అమ్మవారికి కుంకుమార్చనలు జరిగాయి.





సంక్షేమ పథకాలను కించపరచడం తగదు

బైక్ ర్యాలీలో మంత్రి కారుమూరి



తణుకులో బైక్ ర్యాలీలో పాల్గొన్న మంత్రి కారుమూరి, తనయుడు సునీల్‌కుమార్, పార్టీ శ్రేణులు

తణుకు అర్బన్: పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కించపరిచేలా మాట్లాడటం టీడీపీ అధినేత చంద్రబాబుకు తగదని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. సెంటు భూమి స్థలాలపై చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా తణుకు నియోజకవర్గంలో సోమవారం మంత్రి కారుమూరి, యువనేత కారుమూరి సునీల్‌కుమార్‌ల ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం అందించని రీతిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయిలు వెచ్చించి భూమి కొనుగోలు చేసి పట్టణ పరిధిలో సెంటు, గ్రామాల్లో సెంటున్నర స్థలాలను పంపిణీ చేయడాన్ని చంద్రబాబు జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. ముందుగా తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ సజ్జాపురం, సొసైటీరోడ్డు, జాతీయరహదారి, పైడిపర్రు, రాష్ట్రపతి రోడ్డు, వేల్పూరు రోడ్డు, వేల్పూరు, రేలంగి మీదుగా అత్తిలి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి వెంకట సుబ్బారావు, యిండుగపల్లి బలరామకృష్ణ, డాక్టర్ దాట్ల సుందరరామరాజు, బోడపాటి వీర్రాజు, జంగం ఆనంద్‌కుమార్, కోట నాగేశ్వరరావు, మారిశెట్టి శివశంకర్, షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

అత్తిలి: నిరుపేదల ఇండ్ల నిర్మాణానికి ఒక సెంటు స్థలం ఇస్తే సమాధి కట్టుకోవడానికి సరిపోదని ప్రతిపక్ష నాయకుడు దుర్మార్గ ఆలోచనకు నిరసనగా సోమవారం చేపట్టిన భారీ బైక్‌ర్యాలీ విజయవంతం అయిందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. తణుకు నియోజకవర్గంలో మూడు మండలాలు మీదుగా సుమారు పదివేల మందితో భారీ బైక్‌ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, మండలపార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, జడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, తణుకు మండల అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, సర్పంచ్ గంటావిజేత నాగరాజు, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, జిల్లా ప్రచార కమిటి అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, ఉప సర్పంచ్ మద్దాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ వెలుగులు



ముదునూరు వెలమపేటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనతో సంక్షేమ వెలుగులు వచ్చాయని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం ముదునూరు గ్రామంలో మంత్రి ప్రజల సమస్యలను తెలుసుకొని ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ చంద్రబాబువి అన్నీ మోసపూరిత వాగ్దానాలని విమర్శించారు. రాష్ట్రంలో సీఎం జగన్‌కు వస్తున్న ఆధరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు కుట్రలు పనుతున్నాయన్నారు. టీడీపీ మహానాడులో చంద్రబాబు రాబోయే ఎన్నికల గురించి మ్యానిఫెస్టో ప్రకటించి ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారన్నారు. జగన్ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. డీపీవో, మండల ప్రత్యేకాధికారి జీవీకే మల్లికార్జున రావు, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పులూరి వరలక్ష్మి, ఎంపీపీ దాసరి హైమావతి తదితరులు పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

పెంటపాడు: మండలంలో ఆదివారం సాయంత్రం చిలకంపాడు లాకుల సమీపంలో జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. పెంటపాడు ఎస్సై జి. సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం చిలకంపాడుకు చెందిన కంది కృష్ణమూర్తి(38) సోదరుడు అప్పన్నతో కలిసి పెరుగు తీసుకొచ్చేందుకు చిలకంపాడు లాకుల వద్ద దుకాణానికి మోటార్‌సైకిల్‌పై వెళ్లాడు. తిరిగి రోడ్డు దాటుతుండగా గూడెం నుంచి పిప్పర వెళుతున్న మోటార్ సైకిల్ వీరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సోదరుడు అప్పన్నకు స్వల్ప గాయాలు కాగా తీవ్ర గాయాలపాలైన కృష్ణమూర్తిని 108 అంబులెన్స్ ద్వారా ఏరియా ఆసుపత్రికి, అక్కడ నుంచి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం ఏలూరుకు తరలించారు. చికిత్స పొందుతూ కృష్ణమూర్తిని సోమవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుని భార్య సరోజిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కొనసాగుతున్న విజ్ఞాన తరగతులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): సైన్స్ పట్ల విద్యార్థినీ విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జన విజ్ఞాన వేదిక జిల్లా సభ్యులు ప్రత్తి వీరాస్వామి పేర్కొన్నారు. పట్టణంలోని గ్రేడ్ -1 గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరం అధికారి వానపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. సీనియర్ సిటిజన్ దుర్గమ్మచే మెడిటేషన్ కార్యక్రమం, విశ్రాంత ఎంఈఓ సాల్మన్ రాజుచే ఇంగ్లీషు గ్రామర్, విశ్రాంత ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్ జి.శ్రీనివాస్‌చే దేశసేవ, సంరక్షణలపై డిఫెన్స్‌లో ఆయన అనుభవాలను వెల్లడించారు. విశ్రాంత ఎల్ఐసీ ఉద్యోగి గరికిపాటి బాపయ్యశర్మ విద్యార్థులకు పలు అంశాలు బోధించారు.

వరాల వెంకన్న కల్యాణోత్సవాలు

అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న వరాల వెంకటేశ్వరస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం సన్నిధి నాగ వెంకట సత్య సూర్య రామలింగేశ్వరరావు, వీరపద్మ, మామిడిపల్లి రాంబాబు, నాగమణి దంపతులచే స్వామివారికి సుప్రభాతసేవ, మేలుకొలుపు, తోమాలసేవ జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



